క్లుప్తంగా

జగనన్న ఫ్లెక్సీలకు పాలాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న ఫ్లెక్సీలకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. పేదలకు పెత్తందారులకు మధ్య యుద్ధం అనే పేరు మీద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఓర్వలేని కొందరు ఎవరూ లేని సమయంలో వాటిపై పేడ కొట్టడం చేతకాని తనం అని వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పేదల పక్షాన పోరాడే ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. కౌన్సిలర్లు లొక్కు రమేష్, బాలిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నంద్యాల బాలు, గోడి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మాజీ సర్పంచి కమారుడికి ఎమ్మెల్యే మద్దిశెట్టి దీవెనలు



దీవెనలు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి

లక్కవరం (తాళ్లూరు): లక్కవరం మాజీ సర్పంచి తూము ఇందిరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు తూము శివశంకర్‌రెడ్డి కుమారుడు రాకేష్ రెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ వివాహ శుభాకాంక్షలు అందించారు. లక్కవరంలో వారి స్వగృహంలో శుక్రవారం వరుడు రాకేష్‌రెడ్డిని దీవించి అభినందనలు తెలిపారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, సర్పంచిల సంఘ అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, మండలంలోని సర్పంచిలు, ఎంపీటీసీలు, పలువురు ప్రముఖులు దీవెనలు అందించిన వారిలో ఉన్నారు.

రైతు ఆత్మహత్య



రత్తయ్య (ఫైల్)

యర్రగొండపాలెం: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని కొలుకులలో గురువారం రాత్రి జరిగింది. ఒంటేరు రత్తయ్య (42) వ్యవసాయ పనుల కోసం గ్రామంలో రూ.12 లక్షలకుపైబడి అప్పులు చేశాడు. అప్పులు తీర్చమని తీవ్ర ఒత్తిడి రావడంతో అవి తీర్చే మార్గం కనిపించక ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య గంగాదేవి, పెద్ద కుమారుడు శ్రీను డిగ్రీ పూర్తిచేసి పోలీస్ సెలక్షన్ కోసం గుంటూరులో ఉండి ప్రిపేర్ అవుతున్నాడు. చిన్న కుమారుడు శివయ్య పదో తరగతి పాసై ఇంటర్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నాడని గ్రామస్తులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు.

నాణ్యత ప్రమాణాలతో జగనన్న విద్యా కానుక



యూనిఫాం క్లాత్‌ను పరిశీలిస్తున్న జేవీకే టీమ్

యర్రగొండపాలెం: జగనన్న విద్యా కానుక మరింత నాణ్యత ప్రమాణాలతో ఉన్నాయని ఎంఈవో పి.ఆంజనేయులు తెలిపారు. జేవీకే టీమ్ విద్యార్థులకు అందచేసే యూనిఫాం నాణ్యత, పరిమాణం, వస్త్రం కొలతలు శుక్రవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిందని ఆయన తెలిపారు. ఇప్పటికే నోట్ బుక్స్, బ్యాగులు, డిక్షనరీలు వచ్చాయని, బూట్లు, బెల్టులు రెండు రోజుల్లో అందుతాయని, వెంటనే స్కూల్ కిట్లు తయారు చేసి పాఠశాలలకు పంపిణీ చేస్తామని, పాఠశాలలు తెరిచే రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందజేస్తామని ఆయన తెలిపారు.

విద్యుదాఘాతానికి మూడు గేదెలు బలి

కొమరోలు: విద్యుదాఘాతానికి మూడు గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని గోహరపల్లె సమీపంలో శుక్రవారం జరిగింది. బుధవారం సాయంత్రం వీచిన బలమైన ఈదురు గాలులకు గోహరపల్లె గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అయితే విద్యుత్ సరఫరా అవుతూనే ఉంది. శుక్రవారం కసినేపల్లి గ్రామానికి చెందిన పాడి రైతులు గేదెలను మేత కోసం పొలాలకు పంపించగా గోహరపల్లె గ్రామ సమీపంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలకు ఉన్న విద్యుత్ వైర్లను తగలడంతో 3 గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి.

మజ్జిగ పంపిణీ

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలోని కుమ్మరాంకట్ట సెంటర్ వద్ద శుక్రవారం కో ఆప్షన్ సభ్యుడు దమ్మాల జనార్దన్ చేతుల మీదుగా మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి రోజుల్లో ప్రజలు వడదెబ్బకు గురవ్వకుండా నగర పంచాయతీ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జనార్దన్ తెలిపారు.

సేవాలయాలు

కొనకనమిట్ల: గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రానికి పరుగులు తీయాల్సిన పరిస్థితి. రెవెన్యూ, ఎంపీడీఓ, వ్యవసాయశాఖ, ఉపాధి కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా సమస్య పరిష్కారం కాక ప్రయాసపడిన సందర్భాలు కోకొల్లలు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పథకాలు, పౌర సేవలను ప్రజలకు సులభంగా అందించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలు అన్ని వర్గాల ప్రజల నుంచి ప్రశంసలు పొందుతున్నాయి. గ్రామ స్థాయిలోనే ప్రజల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు చేరుతుండటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కొనకనమిట్ల మండలంలో 26 గ్రామ పంచాయతీలుండగా జనాభా ప్రాతిపదికన 18 గ్రామ సచివాలయలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి.



సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది



చినమనగుండంలో పూర్తయిన సచివాలయం

తెల్లవారు జామునే పింఛన్

వైఎస్సార్‌సీపీ అధికాంలోకి రాగానే గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారు. 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి వారి ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను ఇంటివద్దకే అందిస్తున్నారు. పింఛనుదారులకు ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే వారి ఇళ్లకు వెళ్లి నగదు అందిస్తుండటంతో అవ్వాతాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి కల నెరవేరింది





ఈమె పేరు సుంకేసుల కళావతి. గొట్లగట్టు తుంగనగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరాత్నాలు–పేదలందరికీ ఇల్లు పథకంలో వలంటీర్ సాయంతో దరఖాస్తు చేసుకుంది. సచివాలయ సిబ్బంది పరిశీలించి ఆమెను అర్హురాలిగా గుర్తించడంతో పాటు గ్రామంలోని జగనన్న కాలనీలో ఆమెకు ఇంటి స్థలం, గృహ నిర్మాణానికి అనుమతి మంజూరు చేశారు. ఇటీవలే ఆమె ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని గృహ ప్రవేశం చేసింది. పేదల కష్టాలు తీరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఆమె కృతజ్ఞతలు చెప్పింది.

త్వరలో గృహ ప్రవేశం



ఈయన బుడంకాయలపాడు ఎస్సీ కాలనీకి చెందిన చిరుగూరి యేబు. ఉండటానికి సెంటు భూమి లేదు. జగనన్న కాలనీలో స్థలం కోసం వలంటీర్ ద్వారా గొట్లగట్టు సచివాయలంలో దరఖాస్తు చేసుకున్నారు. యేబుకు హౌసింగ్ పథకంలో సెంటున్నర భూమి ఇచ్చారు. అంతే కాకుండా ఇల్లు మంజూరు చేశారు. ఏళ్ల నాటి కల నెరవేరే మార్గం దొరకడంతో ఏబు చక్కని ఇల్లు నిర్మించుకున్నారు. త్వరలోనే గృహ ప్రవేశం చేసేందుకు సిద్ధమయ్యారు.

అప్పుడు రాలేదు.. ఇప్పుడిచ్చారు



ఈయన పేరు పి.వెంకటయ్య. గత ప్రభుత్వంలో ఎన్ని సార్లు దరఖాస్తు చేసినా ఏవేవో కారణాలతో పింఛను మంజూరు కాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పింఛనుకు అర్హత ఉందని వలంటీర్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును పరిశీలించిన అధికారులు వెంకయ్యకు పింఛను మంజూరు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి పింఛను రూ.2750 అందుకుంటున్నారు. ప్రభుత్వ పాలనపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- సన్మాన సభలో ఎమ్మెలే కేపీ నాగార్జునరెడ్డి
- నగదు ప్రోత్సాహకాలు అందజేత

పొదిలి రూరల్: వలంటీర్లు ప్రతి కుటుంబానికి సేవలందిస్తూ సంక్షేమ సారథులుగా నిలుస్తున్నారని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొదిలి నగర పంచాయతీలోని కంభాలపాడు, మాదాలవారిపాలెంతోపాటు మండలంలోని పాములపాడు, కొండాయపాలెం, కుంచేపల్లి, మల్లవరం, తలమళ్ల ఉప్పలపాడు, సూదనగుంట సచివాలయాల పరిధిలోని గ్రామ, వార్డు వలంటీర్లకు పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారుల చేరవేస్తున్నారన్నారు. వలంటీర్లు చిత్తశుద్ధితో పని చేయడం వల్లే ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందన్నారు. 10 సచివాలయాల పరిధిలో దాదాపు 150 మంది వలంటీర్లు పని చేస్తుండగా వారిలో ఐదుగురికి సేవరత్న కింద రూ.20 వేలు, మిగిలిన వారికి సేవామిత్ర కింద రూ.10 వేల చొప్పున నగదు అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ డానియల్ జోసఫ్, ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ, ఈఓఆర్డీ రాజశేఖర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మండల, పట్టణ పార్టీ అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, ఎస్కే నూర్జహాన్ బేగం, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, మాజీ కన్వీనర్ జి శ్రీనివాసులు, కల్లం సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ కె.నరసింహారావు, ఉలవా గోపి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు కె.సుబ్బారావు, ముల్లా జాకీర్, పులిగొర్ల శ్రీనివాసరావు, మల్లాపురం నరసింహాలు, కోదండరామిరెడ్డి, కోటిరెడ్డి, శాంసన్, నారాయణ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతోనే ఉజ్వల భవిష్యత్

- మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- ఏలూరులో గడప గడపకు మన ప్రభుత్వం



సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపైనే రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిష్యత్ ఆధారపడి ఉందని, అదే విశ్వాసాన్ని ప్రజలు సైతం వ్యక్తం చేస్తున్నారని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం పొదిలి మండలంలోని ఏలూరు పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వచ్చిన అధికారులు,నాయకులుకు స్థానిక నాయకులు గుజ్జుల రమణారెడ్డి, గుజ్జుల సంజీవ రెడ్డి, గుజ్జుల గిరిబాబురెడ్డి, సుబ్బారెడ్డి, సర్పంచ్ సింగయ్య ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తరువాత గ్రామంలో రూ.16 లక్షలతో నూతనంగా నిర్మించిన అంతర్గత సిమెంటు రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఎమ్మెలే గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని స్థానికులను అడిగారు. దాదాపు 200 గృహాలను ఎమ్మెల్యే సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీకృష్ణ, ఈఓఆర్డీ కె.రాజశేఖర్, పీఎస్ శేషు, నాయకులు పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కసిరెడ్డి రమణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, పట్టణ కన్వీనరు నూర్జహాన్ బేగం, కల్లం సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాయి రాజేశ్వరరావు, మాజీ కన్వీనర్ జి శ్రీనివాసులు, కె సుబ్బారావు, గూడూరి వినోద్, మల్లాపురం నరసింహులు, కె.బ్రహ్మారెడ్డి, వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలే ప్రభుత్వ అజెండా



వాహనం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

- ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ అజెండా.. అని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యలు తెలుసుకుని అధికారుల ద్వారా వెంటనే పరిష్కరించారు. అనంతరం వికలాంగులకు స్కూటర్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజలకు ఏం కావాలో తెలుసుకుని వారి అవసరాలు తీర్చేందుకు ప్రత్యేక ప్రణాళికల ద్వారా ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. ప్రభుత్వం పార్టీలకతీతంగా పథకాలు అందిస్తోందని చెప్పారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు పెట్టి టీడీపీ నేతలే ప్రభుత్వ సొమ్ము ప్రజలకందకుండా దోచుకుతిన్నారని గుర్తు చేశారు. ప్రభుత్వంలో ఎక్కడా పార్టీలు చూడటం లేదని, ప్రాంతాలు చూడటం లేదని, లబ్ధిదారుడైతే నేరుగా ఇంటికే వలంటీర్ల ద్వారా పథకాలు ఇంటికి చేరవేస్తున్న దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి..అని స్పష్టం చేశారు. ప్రజాసేవ చేయాలనుకునే వారికి ఇదొక సదావకాశమని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి చెప్పారు. మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, కౌన్సిలర్ వీసీ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వైవీ సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు సైదా పాల్గొన్నారు.

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం



ఎనాలసిస్ పరికరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

తాళ్లూరు: ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై వైద్యశాల అభివృద్ధి, వసతి గురించి సమీక్షించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గ్రామీణులు చక్కగా వినియోగించుకుంటున్నట్లు పేర్కొన్నారు. వైద్యశాలలో మిగిలిన పనుల పురోగతి, వసతులు మెరుగు పరచాల్సిన ఆవశ్యకత గురించి వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌బీ తెలిపారు. బయో కెమికల్ యూరిన్ ఎనాలసిస్ పరికరాన్ని, రక్త నమూనాల పరీక్షల విభాగంలో ల్యాబ్‌ను ప్రారంభించారు. సర్పంచి మేకల చార్లెస్ సర్జన్ పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్, టిప్పర్ ఢీ

- డ్రైవర్‌కు గాయాలు

తర్లుపాడు: ఆయిల్ ట్యాంకర్ టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం తాడివారిపల్లి ఘాట్ రోడ్డులో జరిగినట్లు ఎస్సై వి.సుధాకర్ చెప్పారు. పొదిలి వైపు వెళ్తున్న టిప్పర్, పొదిలి నుంచి తాడివారిపల్లి వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ పరస్పరం ఢీకొనడంతో ట్యాంకర్ డ్రైవర్ అఖిలేష్ కుమార్ యాదవ్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వ్యక్తి అని పోలీసులు తెలిపారు. క్షతగాత్రుడిని చికిత్స కోసం వైద్యశాలకు తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతన్నలకు మేలు

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతున్నలకు రైతు భరోసా కేంద్రాల ద్వారా మరింత ప్రయోజనం చేకూరుతుందని వక్తలు అన్నారు. తాళ్లూరు-1 రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డిలు విత్తనాలు పంపిణీ చేశారు. సర్పంచి మేకల చార్లేస్ సర్జన్ అధ్యక్షతన సభ నిర్వహించారు.

నీరు పొదుపుగా వాడాలి

దర్శి: నీరు పొదుపుగా వాడి భూగర్భ జలాలు పెంపొందించేందుకు ప్రతి ఒక్కరి కృషి అవసరమని ఫారెస్ట్ బీట్ అధికారి అసుర అన్నారు. మండలంలోని రాజంపల్లి సచివాలయంలో పర్యావరణంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అసుర మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఒక మొక్కను పెంచి పెద్ద చేయాలని సూచించారు. ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓ కుసుమకుమారి, మండల ప్రత్యేకాధికారి టి.రవి, ఎంపీపీ గోళ్లపాటి సుధారాణి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ముండ్లమూరు: జగనన్న కాలనీల్లో గృహనిర్మాణ లబ్ధిదారులు తమకు సంబంధించిన ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ డీఈ నిరీక్షణరావు సూచించారు. మండలంలోని నూజిళ్లపల్లి సచివాలయం పరిధిలో శుక్రవారం హౌసింగ్‌డే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.

సంక్షేమ పథకాలు ఉపయోగించుకోవాలి

- డీఆర్‌డీఏ పీడీ బాబూరావు

దొనకొండ (దర్శి టౌన్): సంక్షేమ, పొదుపు సంఘ పథకాలు ఉపయోగించుకుని ప్రజలు తమ జీవనోపాధులు మరింతగా అభివృద్ధి చేసుకోవాలని డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బి.బాబూరావు సూచించారు. దొనకొండ వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం మండలంలోని గ్రామైఖ్య సంఘ సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ పొదుపు సంఘంలో ఉన్న ప్రతి మహిళకు చిన్న, మధ్య తరహా యూనిట్ల స్థాపనకు రుణాలు మంజూరు చేయించి ఆర్థికంగా వృద్ధి చెందేలా చేయూత ఇవ్వాల్సిన ఆవశ్యకతను వివరించారు. బడుగు వికాసం ద్వారా ట్రాన్స్‌పోర్టు కార్లు, ట్రాక్టర్లు, ఫోర్‌వీల్ ఆటోల రుణాల మంజూరుకు అవకాశం ఉందని చెప్పారు. రుణాలు సకాలంలో చెల్లించి ఆర్థిక పరపతి పెంచుకోవాలని సూచించారు. పనిచేయని సిబ్బందిపై చట్టప్రకారం చర్యలు తప్పవని పీడీ హెచ్చరించారు. ముందుగా లేటెస్ట్ సెంట్రింగ్ యూనిట్‌ను పరిశీలించి యజమాని ధనలక్ష్మి ద్వారా సాయిబాబా పొదుపు సంఘ సభ్యుల వివరాలు సేకరించారు. కెనరా బ్యాంకు మేనేజర్ ఆశోక్ మాట్లాడుతూ పొదుపు సంఘ సభ్యులు యూనిట్స్ స్థాపించుకుని అభివృద్ధి చెందేందుకు తమ వంతు రుణం సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. లైవ్ లీ హుడ్ (ఎల్‌హెచ్) డీపీఎం డేవిడ్, బ్యాంకు లింకేజీ డీపీఎం సుబ్బారావు, ఏరియా కోఆర్డినేటర్ వసుంధరాదేవి, ఏపీఎం వెంకటేశ్వర్లు, సీసీలు పాల్గొన్నారు.



సెంట్రింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న పీడీ

సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలి

కురిచేడు: ఉపాధి పథకం ద్వారా సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలని జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి సూచించారు. ఉపాధి హామీ పథకం పనులు 2022–23 సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రారంభమైంది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బెల్లం చంద్రశేఖర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని గ్రామాలకు వెళ్లేందుకు రోడ్ల పక్కన కంపచెట్లు పెరిగి ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని, రెండు సార్లు మండల సర్వసభ్య సమావేశంలో చెప్పినా పట్టించుకోలేదని, మొక్కుబడి పనులు చేయవద్దని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేస్తే అందరికీ సంతృప్తిగా ఉంటుందన్నారు. ఈ ఏడాదికి 6 కోట్ల రూపాయల పనులు చేసినట్లు ఎస్ఆర్‌పీ కాంతయ్య తెలిపారు. ప్రతి రికార్డు తమకు అప్పగించాలని, పనులు చూపించాలని కోరారు. తప్పులు జరిగితే వాటిని సరిచేసుకునే అవకాశం ఉంటుందని ఎంపీడీఓ వసంతరావు నాయక్ అన్నారు. ఉపాధి పథకంలో 858, సర్వశిక్ష అభియాన్ ద్వారా 12, పంచాయతీరాజ్ 37, ఆర్ డబ్ల్యూఎస్ 8, అటవీ శాఖ ద్వారా 5 పనులు చేపట్టినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి


దుకాణాలపై సేల్స్‌ట్యాక్స్ అధికారుల దాడులు

కంభం: పట్టణంలోని వ్యాపార దుకాణాలపై శుక్రవారం సేల్స్‌ట్యాక్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. ఈ సందర్భంగా అధికారులు దుకాణాలకు సంబంధించిన లైసెన్సు పత్రాలు, ఇతర బిల్లులు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు దుకాణాలు నిర్వహించాలని సూచించారు.

నేడు భూములకు కౌలు వేలం

తాళ్లూరు: బొద్దికూరపాడులో మాధవస్వామి, సోమేశ్వర స్వామి ఆలయ భూములు కౌలు సాగుకు శనివారం వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మాధవస్వామి దేవస్థానానికి సంబంధించి 46.47 ఎకరాలు, సోమేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి 43.93 ఎకరాల సాగుకు కౌలు పాట మాధవస్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు తగిన డిపాజిట్ చెల్లించి దేవదాయ శాఖ నిబంధనల మేరకు కౌలు పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

రేపు వాగుమడుగు పోలేరమ్మ తిరునాళ్ల



ముస్తాబైన ఆలయం

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు గ్రామంలో ఆదివారం ఏరువాక పోలేరమ్మ తిరునాళ్ల వైభవంగా నిర్వహించనున్నారు. ఏటా జూన్ నెలలో వచ్చే పౌర్ణమి రోజున గ్రామస్తులు అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. వాగుమడుగు, రేగడపల్లి, అంబాపురం, గనివానిపాడు, బోడపాడు పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుంటారు. శనివారం నిలుపు ఉత్సవంతో జాతర ప్రారంభం కానుండగా, ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీ, టీడీపీ ఆధ్వర్యంలో ఏడు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయనున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు పలువురు దాతలు ఏర్పాట్లు చేశారు.

లబ్ధిదారులు వేగంగా ఇళ్లు నిర్మించుకోవాలి



తాడివారిపల్లెలో ఇళ్ల నిర్మాణంపై సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి

తర్లుపాడు: పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, జగనన్న కాలనీల్లో పట్టాలు పొందిన లబ్ధిదారులు వేగంగా ఇళ్లు నిర్మించుకోవాలని ప్రత్యేకాధికారి పరమేశ్వరరావు సూచించారు. శుక్రవారం తాడివారిపల్లి సచివాలయం పరిధిలో హౌసింగ్ డేలో ఆయన పాల్గొన్నారు. జగనన్న లేఔట్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం నాగెల్లముడుపు పంచాయతీలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరకుమార్, ఎంపీడీఓ నరసింహులు, హౌసింగ్ ఏఈ నిర్మల్‌బాబు, ఏపీఎం పిచ్చయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ పంపిణీ

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో పెదారికట్ల గ్రామానికి చెందిన అంకయ్యకు దాతల సహకారంతో దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వీల్ చైర్ అందించామని మండల విభాగం అధ్యక్షుడు నుసుం బాలచంద్రుడు తెలిపారు. సుగర్ వ్యాధి కారణంగా ఐదేళ్ల క్రితం కాళ్లు తీసేయడంతో ఇబ్బంది పడుతున్న అంకయ్యకు శుక్రవారం వీల్ చైర్ అందించామని వివరించారు. అలాగే పెదారికట్ల గ్రామానికి చెందిన దివ్యాంగురాలు బి.గురవమ్మకు సదరం సర్టిఫికెట్ ఇప్పించి, పింఛను పొందేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సహారం దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు



ఇటుక బట్టీల వద్ద తనిఖీ చేస్తున్న అధికారులు

మార్కాపురం టౌన్: బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మార్కాపురం సహాయ కార్మిక శాఖాధికారి ఎం.భూపాల్ హెచ్చరించారు. శుక్రవారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇటుక బట్టీలు, హోటల్స్ ఇంకా పలు వాణిజ్య సంస్థలను టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే రూ.20 వేల వరకు జరిమానా, 6 నెలల నుంచి ఏడాది వరకు జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. ఐసీడీఎస్ సీడీపీఓ సుశీలదేవి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి లక్ష్మి, సిబ్బంది రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.